క్లుప్తంగా

క్రికెట్ పోటీల విజేత ఉప్పలగుప్తం టీమ్



విజయం సాధించిన ఉప్పలగుప్తం యూటీఎఫ్ టీం

ఉప్పలగుప్తం: జిల్లా యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన టీచర్ క్రికెట్ పోటీల్లో ఉప్పలగుప్తం మండలం యూటీఎఫ్ టీం ఘన విజయం సాధించింది. అమలాపురం బాలయోగి క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గన్నవరం టీం మీద ఉప్పలగుప్తం టీం 7 వికెట్ల తేడాతో విజయం సాధించిందని టీం కెప్టెన్ అత్తిలి సురేష్‌కుమార్ తెలిపారు. విజయం సాధించిన టీం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అల్లవరం: దేవగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్లకొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం దేవగుప్తం, డి.రావులపాలెం, సామంతకుర్రు, ఎంట్రుకోన, ఎస్.పల్లిపాలెం, గుండెపూడి గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ రవికుమార్ ఆదివారం తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

తాళ్లరేవు: యానాం–కాకినాడ 216 నెంబరు జాతీయ రహదారిలో పోలేకుర్రు జంక్షన్ వద్ద ఆదివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలనే ధ్యేయంతో కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన ఉత్సవ కమిటీ

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో 189 ఏళ్ల చరిత్ర గల విజయదశమి ఉత్సవాలకు, చెడీ తాలింఖానా ప్రదర్శనలకు సంబంధించి ఆ వీధి దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధులు రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను అమలాపురంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అక్టోబర్ 12న జరిగే దసరా ఉత్సవాల ఊరేగింపునకు హాజరు కావాలని మంత్రి సుభాష్‌కు కొంకాపల్లి 189 ఏళ్ల చెడీ తాలింఖానా లోగోను అందజేసి ఆహ్వానించారు. కొంకాపల్లి దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధి పనసా బుజ్జి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మంత్రిని కలిసింది.

ఈదరపల్లిలో డ్రాగన్ పంట



ఈదరపల్లిలోని తన ఇంట్లో పండించిన డ్రాగన్ ఫ్రూట్స్‌ను చూపిస్తున్న శ్రీలక్ష్మి

అమలాపురం రూరల్: డ్రాగన్ ఫ్రూట్ పేరు వినగానే ప్రతి ఒక్కరూ ఆ పండు తినాలని ఆశ పడుతుంటారు. ఆరోగ్య రీత్యా షుగర్, బీపీ, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులకు డ్రాగన్ ఫ్రూట్స్ ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ గెద్దాడ శ్రీలక్ష్మి తన ఇంట్లోని కుండీలో డ్రాగన్ ఫ్రూట్స్ పండిస్తున్నారు. 2018లో గుంటూరు నుంచి డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు తీసుకొచ్చి తన ఇంటి పైన కుండీల్లో వేసి పెంచితే 2020 నుంచి డ్రాగన్ ఫ్రూట్స్ కాస్తున్నట్లు ఆమె తెలిపారు. ఏడాదికి ఆరు నెలలు మాత్రమే ఈ పండ్లు కాస్తాయని, ఆరు నెలలకు సుమారు 200 పండ్లు కాస్తున్నాయన్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

అయినవిల్లి: నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్‌లో ఆలయ నిర్వాహకుడు శ్రీ సుందర శ్రీనివాసదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం స్వామికి సుందర శ్రీనివాస్‌దాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం ఆయన భక్తులకు శ్రీకృష్ణుని జన్మవృత్తాంతాన్ని వివరించి పారాయణ చేశారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రభూపతిదాసు పాల్గొన్నారు.

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆంధ్రప్రదేశ్ బీసీ, సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా సంసాని రామకృష్ణ నియమితులైయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శంకరరావు నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు రామకృష్ణ ఆదివారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై రాష్ట్ర నాయకులకు, ప్రముఖులకు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన పదవికి అంకిత భావంతో పని చేసి సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

మున్సిపాలిటీలో బిల్లుల దుమారం

- కొన్నేళ్ల కిందటి పనుల బిల్లులకు ఇప్పుడు ఆమోదాలా...?
- రూ.3.50 కోట్ల బిల్లుల లొల్లికి అధికారులే బాధ్యులంటున్న కౌన్సిలర్లు
- వార్డుల్లో జరిగిన పనులకే ఆమోదం కోరుతున్నామంటున్న అధికారులు

అమలాపురం టౌన్: దాదాపు నాలుగేళ్ల క్రితం జరిగిన పనులకు అప్పట్లో టెండర్లు పిలిచామని, ఆ బిల్లులను ఇప్పుడు ఆమోదించాలని అంటున్న అధికారులు తీరుపై అమలాపురం మున్సిపల్ కౌన్సిల్‌కు చెందిన పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తడం కొత్త వివాదానికి దారి తీస్తోంది. ఏకంగా రూ.3.50 కోట్ల బిల్లులపై దుమారం చెలరేగుతోంది. కోవిడ్ సమయంలో జేసీబీ తదితర పనులకు చెందిన బిల్లు కూడా దీంట్లో ఉండడంతో, అసలు అప్పుడెప్పుడో జరిగిన పనికి ఇప్పుడు బిల్లు పెట్టడం ఏమిటని కౌన్సిలర్లు ముక్త కంఠంతో ప్రశ్నిస్తున్నారు. రూ.లక్ష లోపు పనులకు కమిషనర్ టెండరు, కౌన్సిల్ ఆమోదం లేకుండా చేసే అధికారం ఉంటుంది. దీనినే బాక్స్ టెండర్ అంటారు. అయితే రూ.20 లక్షల వరకూ బాక్స్ టెండర్ల ఆమోదంపై కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతున్నారు. మరోవైపు అధికారులేమో మీ వార్డుల్లో మీరు చేయించుకున్న పనులే కదా, కౌన్సిల్ ఆమోదం పొందిన పనులకు ఎప్పుడైనా బిల్లులు పెట్టవచ్చని ఇంజినీరింగ్ అధికారులు వాదిస్తున్నారు. ఎప్పుడో జరిగిన పనులు, జరిగాయో లేదో మాకే తెలియనప్పుడు ఇప్పుడెలా ఆమోదిస్తామని కౌన్సిలర్లు అంటున్నారు.



అమలాపురం మున్సిపల్ కార్యాలయ భవనం

అసలేం జరుగుతోంది..?

సాధారణంగా నిర్వహించే పనులకు అంచనాలు, ఆమోదాలు కౌన్సిల్ అజెండాల్లో చేర్చడం జరుగుతుంది. ఒక్కోసారి అత్యవసరాన్ని బట్టి ఫలానా పనిని క్షేత్రస్థాయిలో ముందే చేపట్టి తర్వాత కౌన్సిల్ ఆమోదానికి పెట్టడం సహజమే. ఒకసారి కౌన్సిల్ ఆమోదం పొందిన పనికి ఎప్పుడైనా బిల్లు పెట్టవచ్చని ఇంజినీర్లు అంటున్నారు. అయితే పెండింగ్‌లో ఉన్న బిల్లులను మున్సిపాలిటీ కమిషనర్ లేదా ఇంజినీర్లు బదిలీ అయినప్పుడు గంపగుత్తగా ఒకేసారి సంతకాలు చేసేసి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చాప కింద నీరులా జరిగిపోతోంది. మున్సిపాలిటీలో కమిషనర్ బదిలీ అయినప్పుడల్లా ఈ తతంగం కొనసాగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత ఆరు నెలల కాలంలో బదిలీ అయిన ఇద్దరు కమిషనర్లు ఇదే తరహాలో రూ.కోట్ల విలువైన పనుల బిల్లులకు ఒకేసారి సంతకాలు చేసేశారంటూ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. అందుకే బదిలీ అయిన ఆయా కమిషనర్లను రప్పించి మరీ విచారణ చేయాలని ఇప్పుడు కౌన్సిలర్లు ఏకాభిప్రాయంతో పట్టుపడుతున్నారు.

బిల్లులు నిలిపేసినా విచారణకు సిద్ధమేనా..?

కౌన్సిల్‌లో పాలక పక్షం తమకున్న అధికారంతో సదరు రూ.3.50 కోట్ల బిల్లులను నిలిపివేసింది. దీనిపై విచారణ చేసే వరకూ బిల్లులు చెల్లించేది లేదని స్పష్టం చేసింది. అయితే ప్రస్తుతం అధికారులు అందుకు సంసిద్ధతతో లేరని వారి సమర్థింపు మాటలను బట్టి తెలుస్తోంది. పైపెచ్చు బదిలీ అయిన కమిషనర్లను, ఇంజినీర్లను విచారణ పేరుతో ఇక్కడకు రప్పించి వారితో మాట్లాడం అంటే అందరూ అధికారులేమనన్న పక్షపాత వైఖరి అందుకు అడ్డుపడుతోంది. గత ఆరు నెలల్లో బదిలీ అయిన ఇద్దరు కమిషనర్లను రప్పించి రూ.కోట్ల విలువ చేసే అన్ని బిల్లులు ఒకేసారి ఒకే రోజు ఎలా ఒకే చెప్పారని అడిగేందుకు, వారు వివరణ ఇచ్చేందుకు అవకాశం ఉంది. కౌన్సిలర్ల పట్టును ప్రస్తుత మున్సిపల్ అధికారులు అంత సీరియస్‌గా తీసుకోవడం లేదని తెలుస్తోంది. కౌన్సిలర్లు మాత్రం అవతవకలపై విచారణ జరిగితేనే నిగ్గు తేలుతోందన్న పట్టుతో ఉన్నారు.

> **డీఎంఏకు లేఖ రాస్తున్నాం**
>
> అవతవకలను అరికట్టేందుకు ముందుగా ఆ బిల్లుల చెల్లింపులు నిలిపేయాలని విజయవాడలోని మున్సిపల్ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ)కు లేఖ రాస్తున్నాం. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేయాలని కమిషనర్‌ను డిమాండ్ చేశామం. బదిలీపై వెళ్లిన ఇద్దరు కమిషనర్లను ఇక్కడకు రప్పించి విచారణ చేసినప్పుడే బిల్లుల్లో అవకతవకలు నిగ్గు తేలుతాయి. కౌన్సిల్ డిమాండ్ చేసినట్లు విచారణ జరగకపోతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చేయిస్తాం.
>
> – మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిల్ పాలక పక్ష ప్రధాన నాయకుడు

విజయదశమికి సిద్ధమవుతున్న చలువ పందిళ్లు



అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద సిద్ధమవుతున్న చలువ పందిరి

అమలాపురం టౌన్: విజయ దశమి ఉత్సవాలకు పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల వద్ద చలువ పందిళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని శ్రీదేవి మార్కెట్‌లో ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఏటా దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఆలయం వద్ద రూ.లక్షల వ్యయంతో సినిమా సెట్టింగ్స్ మాదిరిగా చలువ పందిరిని తీర్చిదిద్దుతున్నారు. ముస్లిం స్ట్రీట్ వైపు పందిరి ముఖ ద్వారం వద్ద దాదాపు 60 అడుగుల ఎత్తులో ఓ ఆలయం సెట్టింగ్ నిర్మిస్తున్నారు. అలాగే కుంకుల సందు వైపు, శ్రీరామపురం వైపు కూడా పందిరి ముఖ ద్వారాలను సెట్టింగ్‌లతో తీర్చిదిద్దుతున్నారు. ఇక పందిరి లోపల ఓ భవంతిలోకి ప్రవేశించిన అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే నెల 16న శ్రీదేవి అమ్మవారి భారీ నిమజ్జన ఊరేగింపును, ఆలయం 45వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఊరేగింపులో కూడా రూ.లక్షల వ్యయంతో 12 రకాల కళాత్మక ప్రోగామ్‌ల కోసం దాదాపు 250 మంది కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. స్థానిక గోఖలే సెంటరులోని కనకదుర్గ ఆలయం(యునైటెడ్ ఆస్పత్రి వద్ద), కల్వకొలను వీధిలోని వేప చెట్టు కనకదుర్గ ఆలయం, నారాయణపేట, సూర్యనగర్, కొంకాపల్లి, వెత్సావారి అగ్రహారం, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాల వద్ద దశమి ఉత్సవాల కోసం చలువ పందిళ్లు నిర్మిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే గుండె భద్రం



అమలాపురంలో వాక్ థాన్ నిర్వహిస్తున్న వైద్యులు, వాకర్స్ తదితరులు

అమలాపురం టౌన్: మందస్తు జాగ్రత్తలతోనే మన గుండె భద్రంగా ఉంటుందన్న నినాదంతో అమలాపురం పురవీధుల్లో వైద్యులు, వాకర్స్, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఉదయం వాక్‌థాన్ నిర్వహించారు. స్థానిక మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ వాక్‌థాన్ కార్యక్రమానికి ఎంపీ గంటి హరీష్ మాథుర్, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని నిత్య వ్యాయామంతోనే గుండె ఆరోగ్యంగా భద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కాలేజీ రోడ్డులోని మెడ్ యునైటెడ్ ఆస్పత్రి వరకూ రెండున్నర కిలోమీటర్ల మేర వాక్‌థాన్ (నడక యాత్ర) సాగింది. ప్రతిఒక్కరూ రోజూ వాకింగ్ చేస్తూ గుండెను కాపాడుకోవాలని, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుని గుండె ఆరోగ్యానికి రక్షణ కల్పించుకోవాలని వాకర్స్ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, జవ్వాది తాతబాబు, మెహబూబ్ షఫీరా, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, మెహబూబ్ షకీలా, నూకల సత్యనారాయణ, ఖ్వాజా బాబు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ జాతికి వన్నె తెచ్చిన మహానుభావుడాయన

అల్లవరం: బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాటి మరీ శెట్టిబలిజ జాతికి వన్నె తెచ్చిన మహానుభావుడు, సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి అని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని అల్లవరం హైస్కూల్ సెంటర్లో నూతనంగా ఏర్పాటుచేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని మంత్రి సుభాష్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ మట్లాడుతూ వందేళ్ల క్రితమే శెట్టిబలిజిలను సంఘటితం చేసి రిజిస్ట్రేషన్ చేసిన ఘనత వెంకటరెడ్డిదన్నారు. బర్మా దేశంలో ఓడల వ్యాపారం చేసి కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పలు పదవులు అనుభవించి, ఆ దేశ అత్యున్నత పురస్కారం బర్మా కేసరి అవార్డును వెంకటరెడ్డి దక్కించుకున్నారన్నారు. శెట్టిబలిజల కోసం



అల్లవరంలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

జిల్లాలో 3 ఎకరాల భూమిని కేటాయించి రూ.5 కోట్ల నిధులతో కళ్యాణమండపం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేద్కర్, దొమ్మేటి వెంకటరెడ్డి జాతి ఉద్ధరణ కోసం పుట్టినవారన్నారు. వీరు ఒక కులానికి పరిమితం కాకుండా అన్ని కులాల వారి అభ్యున్నతి కోసం శ్రమించిన మహోన్నత వ్యక్తులని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది కట్టా బ్రహ్మాజీ అల్లవరం కేంద్రంగా కమ్యూనిటీ స్థలం, భవన నిర్మాణానికి రూ.7 లక్షలను, వెంకటరెడ్డి విగ్రహం కోసం వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన శ్రీను రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. అనంతరం వెంకటరెడ్డి విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన కమిటీ సభ్యులను మంత్రి సుభాష్ సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, సర్పంచ్ బొమ్ము బాలవేణి, రాయుడు విష్ణు, ఎంపీటీసీలు మౌనిక, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి చంద్రమళి, బొక్కా శ్రీను, పితాని శేఖర్, దొమ్మేటి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



భారీ అన్నసమారాధనలో భక్తులు

యానాం: యానాంలో కొలువైన చారిత్రక పిళ్లెయ్యార్ స్వామి(లక్ష్మీగణపతి) ఆలయంలో గణనాథుని బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్థానిక పిల్లారాయవీధిలో జరిగిన ఈ అన్నసమారాధన సందర్భంగా నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

సమ సమాజ స్థాపనకు ఉద్యమించాలి

అమలాపురం రూరల్: సమ సమాజ స్థాపనకు విద్యార్థులు ఉద్యమించాలని పీడీసీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం అన్నారు. సంఘం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం అమలాపురం మద్దాలవారిపేట కళాశాల హాస్టల్‌లో స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు భూషణం మాట్లాడుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు. 50 ఏళ్ల కాలంలో పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ జార్జి రెడ్డి, జంపాల ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, రంగవల్లి లాంటి ఎందరో విద్యార్థి అమరవీరుల ఆశయాల బాటలో ముందుకెళుతున్నామన్నారు. నేటి ప్రభుత్వాలు విద్యారంగానికి అధిక నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, డబ్బు ఉన్నవాడికే విద్య అన్న చందంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.



పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు భూషణం

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతి రావు, మాజీ విద్యార్థి సంఘ నాయకులు పాలమూరి మోహన్‌బాబు, ముత్తాబత్తుల శ్రీనివాసరావు, విప్పర్తి దుర్గాప్రసాద్, బూసి ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యానాం జట్టుకు తృతీయ స్థానం

యానాం: హర్యానా రాష్ట్రంలో ఇండియన్ బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 43వ జాతీయస్థాయి బాలబాలికల సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పుదుచ్చేరి రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన యానాం జట్టు డబుల్స్‌లో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ నెల 25 నుంచి 29 వరకూ జరిగిన పోటీల్లో క్రీడాకారులు కర్నీడి శివసత్యకిషోర్, కట్టుంగి డి.ఎస్‌వీవీ మణిదీప్, కె.తమిళ్‌సెల్వం, పాలెపు యోమంగ్ గంగాధర్‌భరత్ విశేష ప్రతిభ కనబరిచారని బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శశేష సుమన్, అధ్యక్షుడు పవన్‌కుమార్, రాయపురెడ్డి విజయ్ ఆదివారం తెలిపారు. బాల్‌బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ రాజారావు, హర్యానా బాల్‌బ్యాడ్మింటన్‌క్లబ్ అధ్యక్షుడు సునీల్‌కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న హర్యానా రాష్ట్ర ప్రతినిధులు

యువకుడి అరెస్ట్

యానాం: పుదుచ్చేరిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆంధ్రా యువకుడిని అరెస్ట్ చేసినట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నర్రా చైతన్య తెలిపారు. కొద్దిరోజులుగా గోరిమేడు, ధావన్‌ద్రీ నాగ్, ఇలీస్‌పేట తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో నిందితులను పట్టుకునేందుకు ఇన్‌స్పెక్టర్ బాలమురుగన్ నేతృత్వంలో ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటుచేశామన్నారు. సీసీ కెమెరాల్లో దృశ్యాలను బట్టి దొంగతనాలకు పాల్పడుతున్న దరువు సంతోష్‌కుమార్ అలియాస్ బాబు, అతడి మిత్రుడు సయ్యద్‌బాషాను సైతం గుర్తించినట్లు తెలిపారు. తాజాగా సంతోష్‌కుమార్‌ను అరెస్ట్ చేయగా సయ్యద్‌బాషా పరారీలో ఉన్నాడన్నారు. సంతోష్‌కుమార్‌ను విచారించగా తాను అనేక ద్విచక్రవాహనాలతో పాటు మహిళల మెడలో బంగారు గొలుసులు దొంగిలినట్లుగా ఒప్పుకున్నాడన్నారు. అతడిని కోర్టుకు హాజరుపరచగా నిందితుడికి రిమాండ్ విధించారన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శివశంకరరావు(ఫైల్)

అమలాపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన అమలాపురంలో జరిగింది. ఈ నెల 27వ తేదీన కాట్రేనికోన మండలం పల్లంకుర్రు శివారు లైన్ పేటకు చెందిన ఇసుకపట్ల శివశంకరరావు(40) మోటార్ సైకిల్‌పై వెళుతుండగా అమలాపురం ఎర్రవంతెన వద్ద కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శివశంకరరావు అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన అమలాపురం సమనస బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. మృతదేహానికి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

పింఛన్ మంజూరు చేయండి

అల్లవరం: జన్యుపరమైన లోపాలతో పుట్టిన తనకు దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని గోడి గ్రామానికి చెందిన వాసర్ల రమేష్(21) కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతిపత్రం ఆదివారం అందించారు. అల్లవరం సెంటర్‌లో వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రిని మహేష్ కుటుంబసభ్యులు కలిసి పింఛన్ ఇప్పించాలని మొర పెట్టుకున్నారు. తనకు పుట్టిన ఇద్దరు పిల్లలు రమేష్, మున్నీ జన్యుపరమైన లోపాలతో పుట్టారని, వారిలో ఎదుగుదల లోపం ఉందని మహేష్ తల్లి తెలిపింది. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది.

దుర్గమ్మ ఆలయం, ఎరువుల దుకాణంలో చోరీలు

అంబాజీపేట: మండలంలో వరుస చోరీలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. అంబాజీపేటలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో కనకదుర్గమ్మ ఆలయంలోను, ఎరువుల దుకాణంలో చోరీలు జరిగాయి. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న తేలుగుంట్ల మాచరరావు (రాజు)కు చెందిన విజయలక్ష్మి ఏజెన్సీ ఎరువులు, పురుగు మందుల షాపుకు వెనుక ఉన్న గొడౌన్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి లోపలకు ప్రవేశించి రూ.70 వేల నగదును అపహరించుకుపోయాడు. షాపులో ఉన్న క్యాష్ కౌంటర్‌లో నగదును గుర్తు తెలియని వ్యక్తి తీస్తున్నట్లుగా సీసీ ఫుటేజీలో నమోదయిందని షాపు యజమాని రాజు తెలిపారు. అలాగే షాపునకు కూత వేటు దూరంలో వీరభద్ర థియేటర్ సమీపాన ఉన్న విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం చోరీ గురైంది. గుడిలో ఉన్న ధర్మ డిబ్బీని పగలగొట్టి అందులో ఉన్న రూ.5 వేల నగదును అపహరించుకుపోయారు. చోరీ జరిగిన రెండు ప్రాంతాలను పోలీసులు పరిశీలించారు.



ఎరువుల షాపులో చోరీ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తి సీసీ ఫుటేజీ దృశ్యం

రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లవిల్లి విద్యార్థులు



దివ్యభాను



మౌనిక

ఉప్పలగుప్తం: స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్–17లో భాగంగా రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు పీడీ గొలకోటి ఫణీంద్ర తెలిపారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నూకల రేవతి దివ్యభాను హాకీ, దోనిపాటి మౌనిక ఫుట్‌బాల్ ఆదివారం జిల్లా స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో తమ ప్రతిభను కనబరిచారన్నారు. రాష్ట్ర స్థాయి అండర్–17 విభాగాల్లో జరిగే ఆటల పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొంటారని పీడీ ఫణి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఎస్ఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, హెచ్ఎం రాణి, పీడీలు డి.సరస్వతి, వి.విజయభాస్కర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ



చిత్రలేఖనంలో బహుమతులు సాధించిన విద్యార్థులు

యానాం: విద్యార్థుల్లో చిత్రకళను ప్రోత్సహించేందుకు ఆదివారం క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో యానాం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా కొల్లు భావన సృజన, డి.సురేంద్ర ఆకట్టుకునేలా వేసిన చిత్రాలకు న్యాయనిర్ణేతలు బహుమతులు ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమను చిత్రలేఖనంలో ఉపాధ్యాయురాలు ప్రశాంతి ప్రోత్సహించడంతో బహుమతులు సాధించామన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు అభినందించారు.

యానాం మార్కెట్‌లో చీరమేను



యానాం మార్కెట్‌లో చీరమేను

యానాం: పులస తర్వాత అత్యంత ప్రీతిపాత్రమైన గోదావరి చీరమేనును ఆదివారం యానాం మార్కెట్‌కు స్థానిక మత్స్యకారులు తీసుకొచ్చారు. చిన్నపాటి క్యారేజ్‌లో ఉన్న చీరమేనును ఒక వ్యక్తి రూ.6,000కు కొనుగోలు చేశారు. ప్రస్తుతం తక్కువగా చీరమేను పడిందని, రాబోయే రోజుల్లో ఎక్కువగా దొరకవచ్చని ఆశిస్తున్నట్లు స్థానిక మత్స్యకార మహిళలు తెలిపారు. సముద్రం, నదీ కలిసే ముఖద్వారం(సీ మౌత్) ప్రదేశం వద్ద చల్లగా వీచే తూర్పుగాలులకు నీటి అడుగుభాగంలో ఉన్న చీరమేను కాస్తా నీటి పైకి వస్తుంటుంది. గుంపులుగుంపులుగా అధికసంఖ్యలో వచ్చిన చీరమేను చిన్నదిగా ఉండటంతో వలలను కాకుండా మత్స్యకారులు చీరలను ఉపయోగించి పట్టుకుని దానిని ఒడ్డుకు చేరుస్తుంటారు. చీరలతో పట్టడం వల్లే దీనికి చీరమేను అనే పేరు వచ్చింది.

ఉచిత కంటి వైద్య శిబిరం

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని పత్తిగొందిలో స్థానిక సర్పంచ్ దున్నా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. రామచంద్రపురం నేత్ర ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్యులు సీహెచ్ కుమార్, పి.సాయిలక్ష్మి కంటి సమస్యలతో బాధపడుతున్న గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లు చేయడానికి ఆసుపత్రికి తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, గుత్తుల వెంకరమణ, ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ బీచ్‌లో నిరుపయోగంగా టాయ్‌లెట్స్



మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారిన టాయ్‌లెట్స్

యానాం: గౌతమిగోదావరి రాజీవ్ రివర్‌బీచ్‌కు యానాం పరిసర ప్రాంతాలకు చెందిన సందర్శకులు నిత్యం అధిక సంఖ్యలో వస్తుంటారు. స్థానిక జీసెస్ స్టాట్యూ సమీపంలో సందర్శకుల సౌకర్యార్థం కంటైనర్ మొబైల్ టాయ్‌లెట్‌లు ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణను సంబంధిత మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయని పలువురు సందర్శకులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను మరమ్మతులు చేయించకపోవడంతో అక్కడకు వస్తున్న మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పైగా అక్కడి ఏర్పాటుచేసిన ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతుందని తక్షణం మున్సిపల్ సిబ్బంది సమస్యను పరిష్కరించాలని కోరారు.